

పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని అంగర, మాచర, టేకి, కపిలేశ్వరపురం, వాకతిప్ప పాఠశాల లను సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాకతిప్పలో ప్రచారం చేస్తున్న గోపి మూర్తి

చరిత్ర ఘనం... సౌకర్యాలు శూన్యం

- సమస్యల నడుమ ఎంఎస్ఎన్ చారిటీస్
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- ఏళ్ల తరబడి పరిష్కారం కాని వైనం
- నీరుగారుతున్న దాత ఆశయం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పేద విద్యార్థుల పాలిట పెన్నిధిగా సేవలు అందిస్తున్న కాకినాడలోని మల్లాడి సత్యలింగం నాయకర్ (ఎంఎస్ఎన్) చారిటీస్ విద్యాసంస్థలకు ఎంతో చరిత్ర ఉంది. అయితే కొన్నేళ్లుగా సమస్యల వలయంలో విలవిలలాడుతున్నాయి. కనీస వసతులు కరువై అసౌకర్యాల నడుమ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. 1915 జనవరి 29న మరణించిన మల్లాడి సత్యలింగం నాయకర్ మరణ శాసనం అనుసరించి 1915లో ఎంఎస్ఎన్ చారిటీస్ సంస్థ స్థాపించబడింది. విద్య యొక్క ప్రాధాన్యత గుర్తించిన ఆయన ప్రతి ఒక్కరికీ విద్య అందించాలనే లక్ష్యంతో కాకినాడలో ఈ విద్యా సంస్థలను నెలకొల్పారు. 1919లో ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. 1946లో ఉన్నత పాఠశాలను,1956లో వేద పాఠశాలను,1969లో జూనియర్ కళాశాలను, 1972లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక విద్యను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 1953లో ఆంధ్ర పాలిటెక్నిక్ ఏర్పాటు చేయడానికి 29 ఎకరాల భూమిని ఒక రూపాయి నామమాత్రపు అద్దెకు ఇచ్చారు. కాకినాడ రూరల్ అచ్చంపేట వద్ద 40 ఎకరాల స్థలాన్ని ఎంఎస్ఎన్ పిజి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి కేటాయించారు. ఈ విధంగా లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దాత మల్లాడి సత్యలింగం నాయకర్ అవకాశం కల్పించారు. అయితే అధికారుల అలసత్వంతో దాత ఆశయానికి తూట్లు పడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సముచిత గౌరవం

2005లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంస్థను సందర్శించిచి అపర విద్యాదాతగా మల్లాడి సత్యలింగం నాయకర్‌ను కీర్తించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి సంస్థకు వైఎస్సార్ లైఫ్ టైమ్ అవార్డు ప్రకటించారు. ఇక్కడ విద్యనభ్యసించిన ఎల్లా ప్రగాఢ సుబ్బారావు జర్మనీలో భారతదేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. 15 సంవత్సరాల క్రితం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ వరకూ 3000 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 850 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రూ.10వేల కోట్లకుపైగా ఆస్తులు ఉన్నా విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేక సమస్యల సుడిగుండంలో కొట్టుకుంటున్నాయి. విద్యా సంస్థ ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ మౌలిక సదుపాయాలు లేకుండా నడుస్తున్నాయి. మెయిన్ రోడ్ నుంచి హైస్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా ఉంది. 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆటస్థలం మొత్తం నీటితో నిత్యం నిండిపోయి ఉంటుంది. కొంతకాలం కితం ఆట స్థలాన్ని చదును చేసినప్పటికీ సమస్య నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. జూనియర్ కళాశాల భవనం మొత్తం మరమ్మతులకు గురవ్వడంతో స్కూల్ బిల్డింగ్ పైనే మరమ్మతులు చేసి క్లాసులు నిర్వహిస్తున్న దుస్థితి నెలకొంది. ఎండోమెంట్ ఎయిడెడ్ సంస్థలుగా ఉన్న ఈ విద్యాసంస్థల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడంలేదు.

కొరవడిన పర్యవేక్షణ

ఎలిమెంటరీ పాఠశాలలో పర్మినెంట్ ఒకరు, తాత్కాలిక పద్ధతిలో ఒకరు, హైస్కూలులో 14 మంది పర్మినెంట్, ఆరుగురు తాత్కాలిక పద్ధతిలో, జూనియర్ కళాశాలలో ముగ్గురు పర్మినెంట్, 10 మంది తాత్కాలిక, డిగ్రీ కళాశాలలో ఇద్దరు పర్మినెంట్, 16 మంది తాత్కాలిక పద్ధతిలో పని చేస్తున్నారు. అలాగే ఫుల్ టైమ్ ఇఒలు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విద్యాసంస్థల్లో పలు పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నా దేవాదాయ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పదవీవిరమణ చేసిన వారి స్థానంలో కొన్ని కొత్త పోస్టులను మాత్రమే భర్తీ చేస్తుండడం వలన విద్యా ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ విద్యాసంస్థల్లో కనీస వసతులు లేకపోవడం అత్యంత దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం విద్యార్థులు నడవడానికి దారి కూడా లేకపోవడం బాధాకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2016లో పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని ఆధునీకరించడానికి మేనేజ్మెంట్ నిధులు రూ.60లక్షలను కేటాయించారు. రెండేళ్ళు పనిచేసి రూ.35 లక్షలు మాత్రమే ఖర్చు చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారు. దేవదాయ ధర్మదాయ శాఖకు వీటిని మానిటరింగ్ చేసే సమయం కూడా లేకపోవడం దురదృష్ట కరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

దాత ఆశయాలను కొనసాగిస్తాం

సత్యలింగం నాయకర్ ఆశయాలను కొనసాగింపుగా విద్యాసంస్థలను మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునే విధంగా చర్యలు జరుగుతున్నాయి.

మల్లాడి కార్తీక్ నాయకర్, ఛైర్మన్, ఎంఎస్ఎన్ చారిటీస్

తక్షణమే సమస్యలను పరిష్కరించాలి



ఎంఎస్ఎన్ ఎయిడెడ్ విద్యాసంస్థల సమస్యలను పరిష్కారం చేయాలి. పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో గత పది సంవత్సరాలుగా పైగా ఖాళీగా ఉన్న పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం నింపడం లేదు. గత ప్రభుత్వంలో స్థానిక ఎంఎల్ఎ ఆస్తులను అభివృద్ధి చేస్తామని చెప్పినా నేటికీ అమలు కాలేదు. పాఠశాల, కళాశాలకు అదనపు తరగతి గదులు నిర్మించాలి. కొత్త కోర్సులను విద్యాసంస్థల్లో ప్రవేశపెట్టాలి.

ఎం. సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు

ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయం ఎఒ కాంతారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని విమర్శించారు. కేంద్రం పెంచిన ఎక్సైజ్ డ్యూటీ వల్ల వంట నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై రూ.20 వేల కోట్ల భారాలను కూటమి ప్రభుత్వం వేస్తుందన్నారు. ఉచిత ఇసుకను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, దారపు రెడ్డి కృష్ణ, వద్ది సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య, గడిగట్ల సత్తిబాబు, చల్లా విశ్వనాధం పాల్గొన్నారు. ఏలేశ్వరం రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలకు గత ఐదున్నర నెలలుగా ఒరిగిందేమీ లేదన్నారు. ధరల నియంత్రణ లేకపోవడంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. మూతపడ్డ పరిశ్రమలు తెరిపించి, నూతన పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద రాంబాబు, వి.దొంగబాబు, చిరంజీవి, సీలి బాలరాజు, ఎ.బాలా త్రిపుర సుందరి, పి.గురయ్యమ్మ, ఎం.సూర్యారావు, జె.అప్పలరాజు, బల్ల వెంకటలక్ష్మి, ఎ.నాగమణి, పి.లక్ష్మి ఉన్నారు. అలాగే ప్రత్తిపాడు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నిత్యవసర ధరల సైతం విపరీతంగా పెరిగిపోయాయని, ఇసుక పేరుతో దోపిడీ పెరిగిపోయిందన్నారు. మహిళలు పిల్లలపై దాడులు పెరిగిపోయాయని, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సతీష్‌కుమార్, పి.రమణ, సిహెచ్.సత్య, పి.దొంగలు, వరలక్ష్మి పాల్గొన్నారు.



పెద్దాపురంలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు



ప్రత్తిపాడులో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్వాడీ మినీ వర్కర్స్‌ని మెయిన్ వర్కర్స్‌గా మార్చి జిఒ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం 16వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు గురువారం ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రావతి మాట్లాడుతూ జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 59 ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాలలో అంగన్‌వాడీ ఆయా, టీచర్ ఇద్దరు ఉండరని, కేవలం మినీ అంగన్‌వాడీ వర్కర్ మాత్రమే ఉంటారన్నారు. 2012లో పౌష్టికాహారం అందకుండా ఎవరూ ఉండకూడదనే విధానంతో అంగన్‌వాడీ మినీ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఆ సమయంలో వీరి పని గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకి పౌష్టికాహారం అందించి పిల్లలకి ఫ్రీస్కూల్ నిర్వహిస్తే సరిపోయేదన్నారు. కానీ ఇపుడు రికార్డ్ వర్క్‌లు, ఆన్‌లైన్ యాప్‌లతో పని భారం పెరిగిందన్నారు. ఆయా పని, టీచర్ పని మినీ ఒక్కరే చేస్తున్నా ఆమెకు ఇస్తున్న వేతనం కేవలం రూ.7 వేలు మాత్రమేనని అన్నారు. మినీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 16న నిర్వహిస్తున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఐసిడిస్ పీడీని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి ఎంకె.జ్యోతి, మినీ వర్కర్స్ వసుధ, సునీత ఉన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం

ప్రజాశక్తి - కాకినాడ

క్లాప్ వాహన డ్రైవర్ల బకాయి జీతాల కోసం పోరాటాన్ని మరింతగా ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, నగర కన్వీనర్ మలకా వెంకటరణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ తెలిపార. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న క్లాప్ వాహన డ్రైవర్ల ఆందోళన గురువారం నాటికి 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యల పట్ల అధికారుల వైఖరిలో మార్పు రాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్లాప్ డ్రైవర్లకు జీతాలు వేయించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. నగరంలో ఈ వాహనాలు తిరగక పోవడం వల్ల చెత్త పేరుకుపోయే పరిస్థితిలు వచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరైంది కాదన్నారు. శనివారం నుంచి పోరాటం మరింత ఉధృతం అవుతుందని అన్నారు. నిరసన శిబిరంలో మాజీ ప్రధాని నెహ్రూ 135వ జయంతిని క్లాప్ డ్రైవర్లు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచెపు సత్తిరాజు, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ పాల్గొని భారత కార్మికవర్గం కోసం నెహ్రూ చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, శివశంకర్, గంగాధర్, వెంకటేష్, శివ, రాజు, దుర్గాప్రసాద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషబాబ్జి

అబ్దుల్ కలాం అవార్డుకు కృష్ణమోహన్ ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

సోమల రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అవార్డును కాకినాడ నగరానికి చెందిన కృష్ణమోహన్ అందుకున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో సోమల రాజు ఫౌండేషన్ అధినేత శివ రాజు చేతుల మీదుగా కాళ్ళూరి కృష్ణమోహన్ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవ రంగంలో విశేష కృషి చేస్తున్న కష్ణమోహన్‌కు ఈ అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్లడ్ డోనర్స్ అసోసియేషన్స్ గ్రూప్స్, సామాజిక రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్

అపార్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

అపార్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని డిఇఒ పి.రమేష్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, గాడి కొండబాబు, హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. అపార్ రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు కోళ్ల రాంబాబు, మురళీకృష్ణ, సతీష్, ప్రయివేటు పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - కాజులూరు, కరప, సామర్లకోట

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జె.రాంబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామీణాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రాంబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. గ్రామంలో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వెంకటలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎఇ భవానిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ప్రసాద్, ఇఒపిఆర్‌డి రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.అనుపమ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ అన్నామణి, ఇంజనీరింగ్ అధికారులు శైలజ, శ్రీవర్ధన్, పశు సంవర్ధక శాఖ డాక్టర్ రవికిరణ్, ఎపిఒ నాగేంద్రకుమార్, డిఎల్‌సిఒ స్వామి పాల్గొన్నారు. సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, జిపిడిపి, బిపిడిపి, డిపిడిపి అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అవసరాలను గుర్తించి వాటికి అవసరమయ్యే నిధుల విషయంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భైరవ మూర్తి పాల్గొన్నారు.

'అరబిందో ఫార్మా' వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - తొండంగి

మండలంలోని పెరిమాళ్లపురం గ్రామంలో ఉన్న అరబిందో ఫార్మా కంపెనీ వద్ద గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాల చెందిన ప్రజలు కంపెనీ గేటు వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. అరవింద ఫార్మా కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం వలన తాము అనారోగ్యాలకు గురౌతున్నామని నినాదాలు చేశారు. గతంలో రేషన్ కార్డు ఉన్న మత్స్యకార కుటుంబానికి రూ.1.5 లక్షలు పరిహారం మాత్రమే ఇచ్చారని, దీనితో తమ జీవనోపాధి దెబ్బతిన్నదని, ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, ప్రతి కుటుంబానికి జీవనభృతి కింద నెలకి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, అత్యాధునిక ఆసుపత్రి, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తొండంగి, కోటనందూరు ఎస్ఐలు జగన్మోహన్, రామకష్ణ సిబ్బందితో చేరుకుని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి సంఘటనా ప్రాంతానికి చేరుకుని కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. యాజమాన్యంతో మాట్లాడి అధికారుల దృష్టికి తీసుకొస్తామని కంపెనీ ప్రతినిధుల ఆర్‌డిఒకు తెలియజేశారు. ఇదే అంశాన్ని ఆందోళనకారుల దృష్టికి ఆమె తీసుకెళ్లడంతో ఉద్యమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

17న కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

డిసెంబర్ 5 నుంచి 8 వ తేదీ వరకూ ప్రకాశం జిల్లాలో నిర్వహించే 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పురుషులు, మహిళల టీముల ఎంపిక కార్యక్రమం ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు కొండపల్లి శ్రీను గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు పురుషులు 85 కిలోల బరువు, మహిళలు 75 కిలోల బరువు ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఆధార్ కార్డు కాపీని తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 9491191101, 9492166997 నంబర్లలో వీరబాబు, కొట్నీ శ్రీనులను సంప్రదించాలని తెలిపారు.

గ్రామసభలో 74 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నంలో గురువారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి 74 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ గ్రామ సభలో మండల సర్వేయర్ సామోరు, గ్రామ సర్వేయర్లు సాహిత్య, టి.కృష్ణ, విఆర్ఒ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాజులూరు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్‌సి)లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సిహెచ్‌సిలో సుమారు రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ, నేటికీ పూర్తి కాలేదని సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు రోళ్ల చక్రవర్తి, వాకపల్లి చిరంజీవి, అత్తిలి బాబూరావు కలెక్టర్‌కు తెలిపారు. రోగులకు మరుగుదొడ్డి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆక్సిజన్ సరఫరా చేసే పైప్‌లైన్ పూర్తి చేయలేదని వివరించారు. ఈనెల 21వ తేదీ లోపు ఆసుపత్రిపై అంతస్తు పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చి ఆక్సిజన్ సరఫరా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు చొల్లంగి గురుకుల పాఠశాలలో ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ స్వప్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ స్నేహలత, వైద్యులు శిరీష, ఎస్ఐఎండిసి అధికారి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి కాజులూరు గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ షాన్మోహన్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం మండలంలోని గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే కాజులూరు పిహెచ్‌సిని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, లేబరేటరీలో పరీక్షలు, మందుల అందజేత వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు. ఈ తనిఖీలో వైద్యాధికారులు సౌజన్య, శ్రేయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కాజులూరు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో అభివృద్ధి పనులు, పచ్చదనం, విద్యార్థుల క్రమశిక్షణ తీరుపై హెచ్ఎం పంపన కృష్ణమూర్తిని ఆయన అభినందించారు. ఈ పర్యటనలో ఎంపిడిఒ జె.రాంబాబు, నాడు-నేడు వర్క్స్ డిఇ వెంకటరాజు పాల్గొన్నారు.



పనుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

కెసిబిఎస్‌లో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ

ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కెసిబిఎస్)లో గురువారం సహకార వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ చీమలకొండ గంగాధరం సహకార వ్యవస్థ ప్రయోజనాలను వివరించారు. కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు మాట్లాడుతూ సహకార రంగంలో కొనసాగుతున్న కెసిబిఎస్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి ఎంతో విజయవంతంగా నడుస్తోందన్నారు. సహకార వ్యవస్థ మరింత బలోపేతం చేసే దిశగా కెసిబిఎస్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో కెసిబిఎస్ డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఓబిలిశెట్టి బుచ్చిరాజు, శివ బాలయోగి, ఉద్యోగులు పాల్గొన్నారు.



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్లు

టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

శాసనసభ విప్‌గా దాట్ల సుబ్బరాజు నియామకం కావడంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో కట్ట త్రిమూర్తులు అధ్యక్షతన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక ధీరుభాయ్ అంబానీ మానసిక వికలాంగుల పాఠశాలలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, నాయకులు చెల్లి అశోక్, అత్తిలి బాబురావు, మందాల గంగ సూర్యనారాయణ, ముత్యాల జయలక్ష్మి, మోపూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితునికి రూ.5 వేల సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త మారెళ్ల నానికి వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం ధర్మవరంలో ముదునూరి పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యకర్త నాని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, ఎంపిటి సభ్యులు జువ్వల బాబులు, కోలా తాతబాబు, యాళ్ల యేసు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

జిల్లాలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ జగన్నాథపురం ఎపెక్స్ హైస్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎండి.బేగ్ పాల్గొని బాలల దినోత్సవం ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

శాంతినగర్ శ్రీఅగస్త ఇంగ్లీష్ మీడియం స్కూల్ బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు కరస్పాండెంట్ డైరెక్టర్ డిఎన్ఆర్ నాగేశ్వరరావు మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటాలన్నారు. సంఘం ఉపాధ్య క్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, కరోతు సత్యనారాయణ, రౌతు సహదేవుడు, చలంచర్ల నాగేశ్వరరావు, నిత్యానందం, ఊర నాని, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయోగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు. **పెద్దాపురం** శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సాహిత్యం, మీడియా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ పి.ప్రవీణ్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్, ప్రొఫెసర్ సంతానం, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక హైస్కూల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పీస్ పోస్టర్ డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్, అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్య రాజు, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, వినోద్, సతీష్, కట్ట ఆదినారాయణ, అప్పారావు పాఠశాల హెచ్‌ఎం ఆశాలత పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఇంజరం విజడమ్ స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎల్ఐసి మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఎంఎస్ఎన్.సుబ్రహ్మణ్యం, ఎబిఎం సేల్స్ వెంకటేష్, యానాం బ్రాంచ్ మేనేజర్ ఎస్‌విఎస్.ప్రసాద్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాలరావు, ఎల్ఐసి డెవలంప్‌మెంట్ ఆఫీసర్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని చేబ్రోలు జడ్‌పి హైస్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను పిహెచ్‌సి వైద్యులు అర్‌వి.జగదీష్ చేతుల మీదుగా అందజేశార. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పిహెచ్.ప్రకాష్, ఎస్‌ఎంసి ఛైర్మన్ సిహెచ్.ఆంజ నేయులు, వైస్ ఛైర్మన్ బి.శ్రీను, సిఐటియు నాయకులు కుంచె చిన్న, ఒ.నందీశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట** ప్రతిభ పాఠశాలలో చిల్డ్రన్స్ డే కరస్పాండెంట్ ఎస్‌వివిజి.ప్రకాష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అతిథులుగా ఎస్‌బిఐ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్.కళ్యాణ్, ఏజెన్సీ మేనేజర్ రవితేజ, బాస్కెట్ బాల్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎంవివి.ప్రసాద్ పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యరకమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపల్ టి. సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **జగ్గంపేట** శ్రీఅమృత ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల అధినేత సంజయ్‌కుమార్, లోవరాజు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ బాల్యంలో పిల్లలు ఎలా ఉండాలనేది వివరించారు. అనంతరం విద్యార్థులు దేశ భక్తి, సినీ గేయాలకు నృత్యాలు చేశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


కాకినాడ అగస్త పాఠశాలలో విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం



ఏలేశ్వరంలో జరుగుతున్న సభలో మాట్లాడుతున్న విజయబాబు



సామర్లకోట ప్రతిభ పాఠశాలలో...



జగ్గంపేట శ్రీఅమృత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో..

నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలు రైల్వే ట్రాక్‌పై గొల్లప్రోలుకు చెందిన వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణ పరిధిలోని కరణం గారి తోటలో నివాసం ఉంటున్న తొగరు దివ్య(26) గురువారం తెల్లవారుజామున చేబ్రోలు సమీపంలో రైల్వే ట్రాక్‌పై అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె భర్త తొగరు రమేష్ ఎర్రవరం గ్రామంలో అవంతి ఫ్రో ఫుడ్స్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆమెకు మూడేళ్ల క్రితం వివాహం అయింది. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని తూర్పు గోనగూడెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు నౌకాదళానికి చెందిన సామగ్రిని వాహనంలో తీసుకుని వెళుతున్నారు. జాతీయ రహదారి ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి చేరుకునే సరికి హైదరాబాద్ నుంచి విశాఖ వెలుతున్న తుఫాన్ జీప్ నౌకాదళం వాహనం వెనుక వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న ఆశీష్ కుమార్ త్రిపాఠి(32), షేక్ షాబ్జీ (30) అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వీరభద్రుడి సంబరంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కరప

మండలం గురజానపల్లి శివారు అడివిపూడి గ్రామంలో వీరభద్రుని సంబరంలో ఒక మహిళ ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయి మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ఎస్ఐ టి.సునీత వెల్లడించారు. అడివిపూడికి చెందిన గెద్దాడ సత్యవతి తన భర్త సత్యనారాయణతో కలిసి గ్రామంలో జరుగు వీరభద్రుడు సంబరానికి వెళ్లింది. సంబరంలో సత్యవతి ఊగిపోతూ కడుపులో మంట వస్తుందని భర్తకు చెప్పింది. దీంతో స్థానికులకు ఆమెకు నీళ్లి తాగించారు. వెంటనే ఆమె స్పృహ కోల్పోయింది. ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

15 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మరలావ గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 15 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాబ్ది గాయకుడు ఘంటసాల

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎన్నో సినీ గీతాలను ఆలపించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అరని పల్లెసరి సంస్థ ప్రతినిధి పి.మురళీధర్ అన్నారు. యుకె(బ్రిటన్) దేశానికి చెందిన బొందిలి శ్రీనివాస నరసింగ్‌కు చెందిన బూస్టర్ కల్చరల్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో చల్లా సుబ్బరాయుడు సంకలనం చేసి ప్రచురించిన శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకట సత్యనారాయణకు మురళీధర్ అంద జేశారు. ఈ మేరకు మండలంలోని ఏడు హైస్కూల్స్‌కు పుస్తకాలు, ఫొటోలను అందించినట్లు మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్ కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి దిగుబడి

ప్రజాశక్తి - కాజులూరు

ఆశాజనకంగా వరి దిగుబడులు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని శీల గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వరి దిగుబడిలో ఆశాజనకంగా ఉన్నాయని, పొలంబడి ద్వారా రైతులకు అధిక దిగుబడులు సాధించే విధంగా సూచనలు చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అందించే విధంగా రైతులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ పొలంబడి ద్వారా రైతులకు కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కరప ఎడిఎ బాబురావు, మండల వ్యవసాయ అధికారి అశోక్, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు రామకృష్ణ, సర్పంచ్ కోమలి వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలం లోని రాజపూడి జడ్‌పి ఉన్నత పాఠశాలలో మహిళల భద్రత, రక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఫోక్సో చట్టాలు, మహిళా భద్రత మరియు రక్షణకు సంబంధించిన చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు వివరించారు. తోటి విద్యార్థిని విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడడం చట్ట వ్యతిరేకమని అటువంటిది జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఏ విధమైన సహకారం కావాల్సిన 100 లేదా జగ్గంపేట సిఐ 9440796529, ఎస్ఐ 9440796569కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్థానిక హైస్కూల్ విద్యార్థులకు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగుబంట్ల గోపాలకృష్ణ క్రీడా దుస్తులను అందజేశారు. ఇదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆయన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 30 జతల క్రీడా దుస్తులను అందించారు. అలాగే గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న టేకుమూడి శ్రీనివాస్ సైతం 12 జతల క్రీడా దుస్తులను విద్యార్థులకు అందించారు. దుస్తులు అందజేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్ఎంసి ఛైర్మన్ దేవు దుర్గారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, తదితరులు అభినందించారు.

సమిష్టిగా పోరాటం

ప్రజాశక్తి - తొండంగి

తొండింగ్ మండలం బెండపూడిలో విమానాశ్రయం వద్దంటూ అన్నవరం బెండపూడి, ఛిన్నయ్యపాలేనికి చెందిన బాధిత రైతులు సమిష్టిగా పోరాడాలని తీర్మానించారు. గురువారం బెండపూడి హైస్కూల్ వద్ద రైతులు సమావేశం నిర్వహించారు. ఏకగ్రీవంగా పోరాట కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి గౌరవాధ్యక్షులుగా ముదునూరి వెంకటబుచ్చయ్యచౌదరి, అధ్యక్షునిగా పాలచర్ల భాస్కరరావు, కార్యదర్శిగా రాయవరం ఆనంద్, కోశాధికారి బొడ్డు శ్రీకాంత్ ఉపాధ్యక్షులుగా జి.నాగేశ్వరరావు, శ్రీను సహాయ కార్యదర్శులుగా దాసరి సత్యనారాయణ, 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో జెడ్ రాగంపేటకు సంస్థాన ప్రసాద్ కుమార్తె సంస్థాన శాంతకుమారి, ములపర్తి నాగమణి కుమార్తె భవానీలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున పెళ్లికానుకను అందించారు. సర్పంచ్ కందుల చిట్టిబాబు, కందుల కొండయ్య చౌదరి, ఉండవల్లి ప్రసాద్, బొడ్డు రామ్మూర్తి బిక్కిన సాయిబాబు, బొడ్డు రాంబాబు చేతుల మీదుగా ఈ నగదును అందజేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. పలు ప్రాంతాల్లో మాజీ ప్రధానమంత్రి నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలను డిఇఒ పి.రమేష్‌తో కలిసి ప్రారంభించారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో వివిధ విభాగాల్లో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోడీన్ డాక్టర్ వై.సుబ్బారావు మాట్లాడారు. **సామర్లకోట** స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వేడుకను మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ప్రారంభించారు. ఎంఇఒ వై.శివరామకృష్ణ, కనకరాజు, గ్రంథాలయ అధికారిని బి రత్నామణి పాల్గొన్నారు. **పెద్దాపురం** శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను మున్సిపల కమిషనర్ కెవి.పద్మావతి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. **యు.కొత్తపల్లి** ఉప్పాడ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.

యానాం వార్తలు


స్విమ్మింగ్ ఫూల్ శుభ్రం చేస్తున్న సిబ్బంది

స్విమ్మింగ్ ఫూల్‌కు మరమ్మతులు

ప్రజాశకక్తి - యానాం

యానాంలోని జిఎంసి.బాలయోగి క్రీడా ప్రాంగణంలోని స్విమ్మింగ్ ఫూల్ క్లీనింగ్, మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా స్విమ్మింగ్ ఫూల్‌ను క్లీనింగ్ చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రజా పనులశాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ ఫూల్ క్లీనింగ్‌తోపాటు, ఇతర మరమ్మతు పనులను చేపట్టారు. స్విమ్మింగ్ ఫూల్‌ను ఇప్పటి వరకూ శిక్షణకే వినియోగించేవారని, ఇకపై పోటీలు నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దనున్నట్లు క్రీడా ప్రాంగణం ఇన్‌ఛార్జ్, పిఇటి ప్రకాష్(స్వామి), శాయ్ ఇన్‌ఛార్జ్ ఉదయ్ తెలిపారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రాష్ట్ర ట్రేడర్స్ ఫెడరేషన్ ఛైర్మన్, ఎంఎల్ఎ శివశంకర్‌ను బెదిరించిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని యానాం వర్తక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. పుదుచ్చేరిలో వర్తకులను తరచూ బెదిరిస్తున్న ఒక వ్యక్తిపై వర్తకులకు మద్దతుగా శివశంకర్ ఫిర్యాదు చేశారని అన్నారు. శివశంకర్ ను బెదిరించన ఘటనకు నిరసనగా ఈనెల 11న పుదుచ్చేరిలోని ఉన్న ఆయా వర్తక సంఘాలు, వ్యాపారస్తులందరూ ధర్నాచేసి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌కు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. దోషులపై చర్యలు తీసుకోవాలని యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, డిఐజీకి విజ్ఞాపనలు పంపడం జరిగిందని తెలిపారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఉద్యోగాలకు గురువారం ఆన్‌లైన్‌ల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, పీడియాట్రిషన్, సర్జియన్, అనేస్తేటిస్ట్ ఉద్యోగాలకు పుదుచ్చేరి నుంచి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏడి పలాస్‌కుమార్ సన్యాల్, జెఇఒ బేతాళంకుమార్, సూపరింటెండెంట్ ఉందుర్తి శ్రీను పాల్గొన్నారు.

రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతులు, చిరు వ్యాపారులకు మేలు చేసే విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తుందని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయ అధికారి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. గురువారం తాళ్ళరేవు శాఖను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్యాంక్ ఆఫ్ బరోడా 53 శాఖలు ఉన్నాయని, రూ.8 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాఖ మేనజర్ బి.సురేష్, కాకినాడ, మురుమళ్ళ బ్రాంచ్ మేనేజర్లు గణేష్‌కుమార్, రవి, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, మందారపు సత్య లింగాచార్యులు, బీమా బాయి మహిళా మండలి నాయకులు వాసంశెట్టి నందివర్ధన, పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యలపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రవికుమార్ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన విధివిధానాలను రూపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హరికృష్ణారెడ్డి, ఎఒ చలమయ్య, టిఒడిలు శ్రీనివాస్, వల్లి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకునేందుకు దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రత్తిపంటను ఆశిస్తున్న పిండి నల్లి(మిల్లి బాగ్)ని నివారించేందుకు తగిన మోతాదులో మందులను రైతులు పిచికారి చేసి పంటలను కాపాడాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ సూచించారు. మండలంలోని దుర్గాడ గ్రామంలో గురువారం ప్రత్తిపంట పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శర్మ, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్తి పంటపై పిండి నల్లి (మిల్లీబాగ్) ఉధృతి ఎక్కువగా ఉందని, పంట పొలాలు పక్కన బొప్పాయి, బెండ, జామ తోటలు ఉంటే పిండి నల్లి ఉధతి ఉంటుందని వివరించారు.

భీమేశ్వరాలయంలో చిరంజీవి కుమార్తె పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర స్వామి ఆలయంలో మెగాస్టార్ చిరంజీవి పెద్ద కూతురు సుష్మితా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆమె ఆలయానికి చేరుకోగా ఆలయ అర్చకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె భీమేశ్వరునికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పట్టణ జనసేన అధ్యక్షులు సరోజ వాసు, పాల్గొన్నారు.

వాలీబాల్‌లో కాట్రావులపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పోకల దుర్గ రాష్ట్రస్థాయి వాల్‌బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభను చాటుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా దుర్గను స్పోర్ట్స్ మెరిట్ సర్టిఫికెట్, షీల్డ్‌ను ఉపాధ్యాయులు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో అండర్ 14 స్టేట్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్లో దుర్గ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా సామర్లకోట పట్టణం లయన్స్ క్లబ్ భవనం లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత సుగర్, బిపి పరీక్షల శిబిరాన్ని గురువారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్ఆర్‌వివైకె.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో విజన్ ఆసుపత్రి ఎండి డాక్టర్ మహోన్నత్, వీర్చో లేబరేటరీ జిఎం డాక్టర్ ఎన్‌వి.రాఘవాచార్యులు, డాక్టర్ వల్లి, డాక్టర్ శ్రీలక్ష్మీ రోగులకు వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్, లైన్స్ క్లబ్ కార్యదర్శి బడుగు బాబి, ఉపాధ్యక్షులు సేపేని సురేష్, లైన్ జిల్లా ఛైర్మన్ చిత్తూలూరి వీర్రాజు (రాజా), గుండు శంకర్రావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆదిత్యలో జాతీయ స్థాయి సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో 15, 16 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 2000 మంది విద్యార్థులు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, ఇతర విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. 'కంప్యూటేషనల్ అడ్వాన్స్మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్' అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.పటేల్, శాస్త్రవేత్త, సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ అనిల్ నీల్ కాంత్ గైక్వాడ్, మదర్ థెరెసా ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. కవిమణి, ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ డాక్టర్ ఎంవి.రమణ, ప్రిన్సిపల్ సైంటిస్ట్, అనలిస్ లాబ్స్ డాక్టర్ చాగంటి శ్రీధర్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

అలల తాకిడికి బోటు ధ్వంసం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ తీరంలో అలలు తాకిడి అధికంగా ఉండడంతో బోటు ధ్వంసమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాలు ప్రకారం...బంగాళాఖాతంలో తుపాను హెచ్చరికలతో ఉప్పాడ సముద్ర తీరం అలలు ఉవ్వెత్తిన ఎగిసి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సుబ్బంపేట గ్రామానికి చెందిన బొందు ఇస్సాకు బోటులో వేటకు వెళ్లి ముగించుకుని అమీనాబాద్ మినీ హార్బర్ వద్దకు తిరిగి వస్తున్న సమయంలో అలల తీవ్రతకు మినీ హార్బర్ వద్ద వేసిన రాళ్లను బోటు ఢీకొనడంతో బోటు ధ్వంసం అయింది. అయితే తీరానికి అతి దగ్గరలో ఉండడంతో బోటులో ఉన్న మత్స్యకారులు సురక్షితంగా బయటికి చేరుకున్నారని వారు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం సరఫరా చేసి రైతులు మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌వివి.పసాద్ అన్నారు. గురువారం మండలంలోని జి.రాగంపేట గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులకు నూతన కౌలు చట్టంపై ఎఇఒ బి.స్రవంతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం ద్వారా కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల ద్వారా కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు భాషా ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రవరం గ్రామంలో టిడిపి సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైరాల కనకారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కొండపల్లి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా ఈనెల 15వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎస్ డిఎస్.ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి, ఆనూరు, వాలు తిమ్మాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైసిపి నాయకుల భూ దోపిడీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలానికి చెందిన వైసిపి నాయకుల భూ దోపిడీపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన వడగ శ్రీరాములుకు చెందిన భూమిని వైసిపికి చెందిన మాజీ ఎంపిపి అబ్బిరెడ్డి నారాయణ రెడ్డి, యలమంచిలి ఉమామహేశ్వరరావులు తమ సమీప బంధువు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి భూ దోపిడీకి పాల్పడ్డారని తెలుగు జనతా పార్టీ నాయకుడు పెద్దింశెట్టి వెంకటే శ్వరరావు ఆరోపించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద బాధితుడు శ్రీరాములతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. వడగ శ్రీరాములు 2011లో కాకినాడ సెజ్ పరిధిలో ఉన్న 50 సెంట్లు అవార్డు భూమిని ఇద్దరు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశాడని, ఆ సమయంలో రిజిస్ట్రేషన్ కాక, క్రియ ఒప్పందపత్రం రాయించుకున్నారని తెలిపారు. 2023లో అవార్డు భూమిని తిరిగి రైతులకు ఇచ్చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పాత యజమానుల పేరు మీదే సెజ్ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. పాత భూ యజమానులు ఇద్దరూ మండలానికి చెందిన వైసిపి నాయకులు అబ్బిరెడ్డి నారాయణ రెడ్డి, యలమంచిలి ఉమామహేశ్వరరావులతో కుమ్మక్కై నారాయణ రెడ్డి బంధువు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు. ఈ అంశాన్ని గ్రామ పెద్దల సమక్షంలో పెట్టడంతో 23 సెంట్లు భూమిని శ్రీరాములు పేరిట రిజిస్ట్రేషన్ చేసి మిగతా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయమంటే కాలయాపన చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. అడిగితే మీ కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత వ్యక్తులపై రెండో దఫా కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.